క్లుప్తంగా

మారెమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గోస్పాడు: నెహ్రూ నగర్‌లోని మారెమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి దేవాలయం ఏర్పాటు చేసి తొమ్మిది సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. వేద పండితుడు గిరినాథశర్మ ఆధ్వర్యంలో అమ్మవారి వద్ద చండీ హోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

తహసీల్దార్‌గా జయశ్రీ

శిరివెళ్ల: మండల నూతన తహసీల్దార్‌గా జయశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గత తహసీల్దార్ పుష్పకుమారి ఆర్‌డీఓ కార్యాలయ ఏఓగా బదిలీ కావడంతో ఈ నియామకం జరిగింది. నూతన తహసీల్దార్ కర్నూల్ కలెక్టరేట్‌లో ఏఓగా పని చేస్తూ ఇక్కడికి వచ్చారు.

పీజీఆర్ఎస్ వినతుల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నంద్యాల(అర్బన్): పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులకు తక్షణ పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక నిశాంత్ భవన్‌లో సోమవారం నంద్యాల అర్బన్, రూరల్ వీఆర్‌ఓలతో పీజీఆర్ఎస్‌లో వచ్చిన వినతులు, పరిష్కార మార్గాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ సమస్యలు ఏమైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కార మార్గాలు చూపాలని, కార్యాలయం వద్దకు తేవద్దని సూచించారు. కౌలు దారులందరికీ కౌలు గుర్తింపు కార్డులు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారావు, రీసర్వే డీటీ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు సన్మానం

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని అబాండం తండా ఎంపీపీ పాఠశాల హెచ్ఎం దస్తగిరి బదిలీపై వెళ్తుండటంతో గ్రామస్తులు ఆయనను సోమవారం ఘన సన్మానించారు. స్థానిక పాఠశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ–2 శివరాంప్రసాద్, గ్రామ పెద్దలు స్వామినాయక్, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరై హెచ్ఎం విద్యార్థుల చదువు పట్ల తీసుకున్న శ్రద్ధను కొనియాడారు. కార్యక్రమంలో పాఠశాల నూతన హెచ్ఎం భారతి, ఉపాధ్యాయులు అబ్బాస్‌ఖాన్, పద్మిని, పీఆర్‌టీయూ నాయకులు రామపక్కీర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, సుభాన్, ప్రేమ్‌కుమార్, విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పొలం పిలుస్తోంది

రుద్రవరం: మండలంలో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయాధికారిణి సుమతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పంట సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమం ముందుగా కోటకొండ పంచాయతీ మజరా గ్రామాలైన కె.కొత్తూరు, చెంచుగూడెంల నుంచి మొదలవుతుందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ పూర్తి అయ్యే వరకు వరుసగా గ్రామల్లో తిరుగుతూనే ఉంటూ రైతులకు అందుబాటులో ఉంటామని ఆమె తెలిపారు.

మైక్‌ల శబ్దాలను నిరోధించాలి

నంద్యాల(అర్బన్): చిరువ్యాపారులు మైక్‌ల ద్వారా వీధుల్లో చేసే శబ్దాలను నిరోధించాలని బీసీ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు చింతలపల్లె సుధాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. వన్‌టౌన్, టూటౌన్ ఏరియాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉందని పోలీసులు జోక్యం చేసుకొని వాటిని నియంత్రించాలని కోరారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నంద్యాల(న్యూటౌన్): బేతంచెర్ల పట్టణంలో సీపీఎం నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలపై విద్యుత్ భారాలు రెట్టింపు అవుతున్నాయని, దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలన్నారు. బేతంచెర్లలో సీపీఎం కార్యకర్తలు, ప్రజలు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకుంటే వారిపై కేసులు పెట్టడం ఎంత వరకు సబబు అన్నారు.

బాబోయ్ గుంతలు!

నంద్యాల(అర్బన్): అధికారంలోకి రాగానే రోడ్లను బాగు చేస్తామని కూటమి పార్టీలు ప్రకటించాయి. ఇంటింటికీ వెళ్లి ఆ పార్టీల నాయకులు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా అతీగతీ లేదు. ఏ రోడ్డు చూసినా మోకాళ్లలోతు గుంతలు కనిపిస్తున్నాయి. ఇది ఎక్కడో మారుమూల గ్రామాల్లో కూడా కాదు జిల్లా కేంద్రమైన నంద్యాలలోనే ఈ పరిస్థితి ఉంది. దీంతో వివిధ పనుల మీద చుట్టుపక్కల గ్రామాల నుంచి పట్టణానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొత్త రోడ్లు దేవుడెరుగు ఉన్న రోడ్లను బాగు చేస్తే చాలని వారు కోరుతున్నారు. పట్టణ సమీపంలోని చాబోలు, బిల్లలాపురం రోడ్లు, నంద్యాల నుంచి నందమూరినగర్ వెళ్లే రోడ్డు, రాయమాల్పురం నుంచి పోలూరు వెళ్లే రహదారిలో ప్రయాణం నరకాన్ని తలపిస్తుంది. పలువురు ఆయా రోడ్లలోని గుంతల్లో పడి గాయాలపాలయ్యారు. పరిస్థితి మరింత తీవ్రం కాకముందే అధికారులు స్పందించి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా చాబోలు గ్రామ రోడ్డు



అడుగడుగున గుంతలతో రాయమాల్పురం నుంచి మునగాల వైపు వెళ్లే రహదారి



దెబ్బతిన్న నంద్యాల- వైఎస్సార్‌నగర్ రోడ్డు



ప్రమాదకరంగా బిల్లలాపురం దారి

మహానందీశుడికి పల్లకీసేవ

మహానంది: మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ నిర్వహించారు. ముందుగా ఆలయ వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఇన్‌స్పెక్టర్ పి.సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పండితులు, అర్చకులు స్వామివారి ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువు దీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

భార్య, భర్తపై చీటింగ్ కేసు

కోవెలకుంట్ల: కుమార్తె, అల్లుడు నమ్మించి ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకుని మోసం చేయడంతో బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నివాసం ఉంటున్న ఈశ్వరమ్మ కుమార్తె అన్నపూర్ణకు రాఘవరెడ్డితో వివాహం చేసింది. ఇటీవల కుమార్తె, అల్లుడు ఈశ్వరమ్మ పేరున ఉన్న ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. తల్లి బతికి ఉన్నంతకాలం ఇంటికి సంబంధించి సర్వ హక్కులు తనకే చెందుతాయని అగ్రిమెంట్ రాసి ఇచ్చారు. తీరా ఆమె బంధువుల ఇంటికి వెళ్లగా ఆ ఇంటిని మరొకరికి బాడుగకు ఇవ్వడంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు భార్య, భర్తలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఏపీ మున్సిపల్ వాటర్ వర్క్, స్ట్రీట్ లైటింగ్, కాంట్రాక్ట్ కార్మికుల సంఘం, సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గౌస్, అధ్యక్షుడు రామాంజనేయులు, సెక్రటరీ రంగనాథ్ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ పట్టణాల పరిశుభ్రత, ప్రజారోగ్యం, పర్యావరణాన్ని పరిరక్షిస్తున్న మున్సిపల్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్యం కార్మికులకు ఎలాంటి షరతులు లేకుండా తల్లికి వందనం పథకంతో సహా ప్రభుత్వ పథకాలన్నీ వర్తింప జేయాలని డిమాండ్‌చేశారు. ఆదాయ పరిమితికి సంబంధం లే కుండా ఇవ్వాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తూ మరణించిన కార్మికులు బసవయ్య, తులసీరాం మధు, రాజశేఖర్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో కార్మిక నాయకులు భాస్కరాచారి, ఆదాం, రామకృష్ణ, కృష్ణయ్య, ప్రసాదరావు, సతీష్, కరీముల్లా, మురళీ, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గోవధను నిషేధించాలి

నంద్యాల(వ్యవసాయం): జిల్లాలో గోవధను నిషేధించాలని రాష్ట్రీయ ధర్మ రక్షా దళ్ నాయకులు కోరారు. ఈ అంశంపై వారు సోమవారం కలెక్టర్ రాజకుమారిని కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాష్ట్రీయ ధర్మ రక్ష దళ్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌పీ నవీన్‌గౌడ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో గోవధ నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, గో హంతకులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ధర్మ రక్షా దళ్ జిల్లా గోరక్షక్ విభాగ్ ప్రముఖ్ రాంచరణ్, సతీష్, కల్యాణ్ ఆచారి, నిఖిల్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న సేవలో ఐఏఎస్ అధికారులు



ఐఏఎస్ అధికారులకు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఈఓ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను పలువురు ఐఏఎస్ అధికారులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సోమవారం మధ్యప్రదేశ్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ చైర్మన్ స్మితా భరద్వాజ్, పాండిచ్చేరి ప్రభుత్వ కార్యదర్శి ఎస్ఎస్ రావత్ మల్లన్న దర్శనానికి ఆలయ రాజగోపురం వద్దకు రావడంతో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం వారు మల్లికార్జున స్వామికి, భ్రమరాంబాదేవికి పూజలు నిర్వహించుకున్నారు. వేద పండితులు వేదమంత్రాలు పలకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థాన ఈఓ స్వామి వారి శేష వస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపకను అందించి సత్కరించారు.

ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తాం



ఖైదీల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి

నందికొట్కూరు: లాయర్‌ను నియమించుకునే ఆర్థిక స్తోమత లేని ఖైదీలకు ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని కర్నూలు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి తెలిపారు. సోమవారం సబ్‌జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. 60 ఏళ్ల వయస్సు పైబడిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదుపాయలు, భోజనాలు గురించి ఆరా తీశారు. జూలై 5న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం ఉంటుందని, రాజీకాదగిన కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఆయన వెంట న్యాయవాది అరుణ్‌కుమార్ ఉన్నారు.

అంగన్‌వాడీ పిలుస్తోందిపై ర్యాలీ



శిరివెళ్లలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

శిరివెళ్ల: 2025–26 విద్యా సంవత్సరానికి అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రవేశాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా సోమవారం చిన్నారుల కోసం టీచర్లు, ఆయాలు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన వర్కర్లు అంగన్‌వాడీ పిలుస్తోంది పేరుతో ర్యాలీ నిర్వహించారు. టీచర్ యూనియన్ నాయకురాలు వసుంధర మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడంతో పాటు ఆట పాటలతో చదువు నేర్పుతున్నామన్నారు. అలాగే గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు.

తండ్రీకుమారుడికి గాయాలు

డోన్ టౌన్: మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై బైక్‌ను కారు ఢీకొనడంతో తండ్రీకుమారుడు గాయపడ్డాడు. వివరాలు.. డోన్ మండలం పెద్ద మల్కాపురం గ్రామానికి చెందిన దస్తగిరి తాడూరు గ్రామంలో వివాహం చేసుకుని భార్య ఊరిలోనే నివాసం ఉంటున్నాడు. ఈ నెల 15న కుమారుడు సాహెర్ హుస్సేన్(3)తో కలిసి బైక్‌పై స్వగ్రామమైన పెద్దమల్కాపురానికి వెళ్లి సోమవారం రాత్రి తాడూరుకు తిరుగు ప్రయాణం అయ్యాడు. ఓబులాపురం గ్రామ సమీపంలో రోడ్డు దాటుతుండగా అనంతపురం నుంచి కర్నూలు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రీకుమారుడికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమ్మిత్తం డోన్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుడు లేని పాఠశాల..!



మీర్జాపురం మెయిన్ ప్రాథమిక పాఠశాల

కొలిమిగుండ్ల: మూరుమూల గ్రామాల్లో విద్యాభివృద్ధి కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేని కారణంగా వృథాగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. మీర్జాపురంలోని మెయిన్ ప్రాథమిక పాఠశాలలో గత విద్యా సంవత్సరం మధ్యలో అక్కడ విధులు నిర్వహించే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోయాడు. అప్పటి నుంచి పోస్టు ఖాళీగా ఉంది. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం రోజు సైతం ఉపాధ్యాయుడు లేక పాఠశాల ఖాళీగా ఉంది. ఇక్కడ 20 మందికి పైగానే విద్యార్థులున్నారు. ఇటీవల ప్రభుత్వం నుంచి పాఠ్యపుస్తకాలు, యూనిఫాం మంజూరు చేశారు. ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులను సమీపంలోని డిపెప్ స్కూల్‌కు పంపుతున్నారు. డిపెప్ స్కూల్‌లో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా ఒకరు పదోన్నతిపై వెళ్లారు. ఉన్న ఒక ఉపాధ్యాయుడు తప్పనిసరి బదిలీలో భాగంగా ఇతర పాఠశాల కోరుకున్నారు. సింగిల్ టీచర్ కావడంతో ఎవరైనా వచ్చే వరకు ఆటీచర్ ఉండాల్సి రావడంతో విధులు నిర్వహిస్తున్నారు.వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు-నేడు పథకం కింద మెయిన్ ప్రాథమిక పాఠశాల ఎంపిక కావడంతో పలు పనులు చేపట్టారు. విద్యార్థులకు టేబుళ్లు ఏర్పాటు చేశారు. అన్ని వసతులు సమకూరాక ఉపాధ్యాయుడు లేకుండా పోయాడు. తమ పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి పాఠశాల జరిగేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లితండ్రులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం
- స్టాప్ డయేరియా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నంద్యాల(న్యూటౌన్): వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గట్టి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుతం పరిసరాలు,తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఈఓఆర్డీలు ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలాల్లో ఎక్కడైతే చెత్త చెదారం ఎక్కువ ఉంటుందో వాటిని ఆశా, ఏఎన్ఎం వెక్టార్ యాప్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేయడం జరుగుతుందని, వాటిని పంచాయతీ సెక్రటరీ పరిశీలించి క్లియర్ చేయాలన్నారు. అదే విధంగా వాటర్ అండ్ శానిటేషన్ యాప్‌లో కూడా హెచ్2ఎస్ పరీక్షలు నిర్వహించి ఎక్కడా నీటి కలుషితం జరగకుండా క్లోరినేషన్ చేయాలన్నారు. అదే విధంగా పీఆర్ వన్ యాప్‌లో సరైన డేటా నమోదు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తల్లికి వందనం అభ్యంతరాల స్వీకరణ

నంద్యాల(న్యూటౌన్): గ్రామ/వార్డు సచివాలయాల్లో 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాలులో ఆ పథకంపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం కింద అనర్హులుగా ప్రకటింపబడిన వారి అభ్యంతరాలు, ఫిర్యాదులను ఈ నెల 25వ తేదీలోగా తీసుకోవడం జరుగుతుందన్నారు. అయితే కొంత మంది తల్లులకు అందుకు సంబంధించిన నగదు జమ కాలేదని అర్జీ ఇవ్వడం జరిగిందన్నారు. సదరు దరఖాస్తులను రాష్ట్ర స్థాయిలో 26, 27 తేదీలలో పరిశీలించి అందుకు సంబంధించిన నగదు జూలై 5వ తేదీలోగా వారి ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 12వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అయ్యాయని, స్పెషల్ అధికారులు సంబంధిత పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు ఉన్న మౌలిక సదుపాయాలను గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు. విద్యార్థుల వసతులకు సంబంధించిన ఫొటోలను తీసి పంపాలని మండల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

చిన్నారులకు ఉచితంగా రక్తం అందిస్తాం

నంద్యాల(అర్బన్): తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు జిల్లాలోని రక్తనిధి కేంద్రంలో నమోదు చేసుకుంటే అవసరమైనప్పుడు ఉచితంగా రక్తం అందజేస్తామని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కేసీ కెనాల్ కార్యనిర్వహక ఇంజినీర్ కార్యాలయ ఆవరణలో ఉన్న రక్త నిల్వ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు, ల్యాబ్ టెక్నీషియన్ రమేష్ బాబు, కోఆర్డినేటర్ అబ్దుల్ సమీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్త నిల్వ కేంద్రంలో హోల్ బ్లడ్, ప్యాకెడ్ సెల్స్ విడివిడిగా అందుబాటులో ఉన్నాయన్నారు. అవసరమైన వ్యక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రక్త నిల్వ కేంద్రంలో పరికరాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకొని వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చూడాలన్నారు.

ట్రిపుల్ ఐటీడీఎంలో ఫిట్‌నెస్ సెంటర్ ప్రారంభం

కర్నూలు (సిటీ): ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్ ఐటీ డీఎం)లో కొత్తగా స్థాపించిన శ్రీకృష్ణ దేవరాయ యువ క్రీడ ప్రాంగణం (స్పోర్ట్స్ అరీనా), అవుట్ డోర్ జిమ్ మరియు ఫెమినా ఫిట్‌నెస్ సెంటర్ (లేడీస్ జిమ్)లను సోమవారం ఐఐఐటీడీఎం డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యోగులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండేందుకు ఫిట్‌నెస్ సెంటర్లు చక్కగా ఉపయోగపడతాయన్నారు. క్యాంపస్ కమ్యూనిటీలో సమగ్ర శ్రేయస్సు, శారీరక దృఢత్వం, వినోద అభివృద్ధిని ప్రోత్సహించడం కోసం వీటిని ఏర్పాటు చేశామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రియాశీల జీవనాన్ని ప్రోత్సహించడానికి, ఫిట్‌నెస్ సంస్కృతిని పెంపొందించడానికి, క్యాంపస్‌లోని సభ్యులందరికీ నాణ్యమైన వినోదమాలిక సదుపాయాలను పొందేలా చూసుకోవడానికి ఈ ఆధునిక సౌకర్యాలను ఆలోచనాత్మకంగా అభివృద్ధి చేశామన్నారు. ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి పోలీసుల అంత్యక్రియలు

పగిడ్యాల: స్థానిక విఘ్నేశ్వర ఆలయం వద్ద సోమవారం మృతి చెందిన అనాథకు ముచ్చుమర్రి పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. పాలమర్రి గ్రామానికి చెందిన బోయ నాగేషులు(62) మూడు దశాబ్దాల క్రితం గ్రామం విడిచి వెళ్లాడు. తనవాళ్లు ఎవరూ లేకపోవడంతో గడివేములలోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో మూడు రోజుల క్రితం నందికొట్కూరులోని పగిడ్యాల బస్ ఎక్క బోయి ముచ్చుమర్రి బస్ ఎక్కి కొత్త ముచ్చుమర్రిలో దిగాడు. అక్కడ మూడు రోజుల పాటు ఆంజనేయస్వామి ఆలయం వద్దనే నీరసంగా పడి ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ సుబ్బారావు ఘటనా స్థలానికి చేరుకుని ఆటోలో పాముర్రికి పంపించగా.. మార్గమధ్యలోనే మృతిచెందాడు. కుటుంబ సభ్యులెవరూ లేకపోవడంతో వీఆర్వో నాగన్న సమక్షంలో పంచనామా నిర్వహించి పంచాయతీ అధికారుల సహకారంతో అంత్యక్రియలు పూర్తి చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

కేడీసీసీబీలో సిందూర్ డిపాజిట్ స్కీమ్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకును అభివృద్ధి బాటలో నడిపించేందుకు ప్రతిఒక్కరూ జవాబుదారీతనంతో పనిచేయాలని చైర్మన్ డి.విష్ణువర్ధన్‌రెడ్డి బ్రాంచ్ మేనేజర్లను ఆదేశించారు. సోమవారం మొదటిసారిగా నిర్వహించిన బ్రాంచ్ మేనేజర్ల సమావేశంలో ఆయన పాల్గొని బ్యాంకును లాభాల బాటలో నడిపించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు ఇచ్చారు. 2024–25 సంవత్సరానికి పేరుకుపోయిన రూ.265 కోట్ల బకాయిలను తగ్గించాలన్నారు. ప్రతి రైతును కలసి బకాయిలు వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. 2025–26లో బ్యాంకు టర్నోవర్ రూ.4500 కోట్లకు పెంచాలన్నారు. బ్యాంకును లాభాల్లోకి తీసుకెళ్లడం ద్వారా సభ్యులైన పీఏసీఎస్‌లకు 2–3 శాతం డివిడెంటు ఇచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. బ్యాంకులో 333 రోజుల సిందూర్ డిపాజిట్ పథకాన్ని చైర్మన్ ఆవిష్కరించారు. సీనియర్ సిటిజన్‌లకు 6.90, ఇతరులకు 6.40 శాతం వడ్డీరేటు ఉంటుందని, ఈ అవకాశం జూన్ 16 నుంచి జూలై 15 వరకు మాత్రమే ఉందని తెలిపారు. సీఈఓ రామాంజనేయులు, నాబార్డు డీడీఎం సుబ్బారెడ్డి, డీజీఎంలు ఉమామహేశ్వర రెడ్డి, సునీల్‌కుమార్, నాగిరెడ్డి, ప్యాక్స్ డెవలప్‌మెంటు సెల్ మేనేజర్ నదిమా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ఖరీఫ్ సాగు

- తొలకరి రాకతో వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ
- విత్తనాల పంపిణీ ఊసేత్తని సర్కారు



హరివరం సమీపంలో మొక్కజొన్న నాటుతున్న వ్యవసాయ కూలీలు



ఉయ్యాలవాడలో పొలాన్ని ట్రాక్టర్ సాయంతో సాగుకు సిద్ధ చేస్తున్న రైతన్న

ఉయ్యాలవాడ : ఖరీప్ సాగు పనులు జోరందుకున్నాయి. ఈ ఏడాది మే నెల చివరి వారంలోనే వానలు పడటంతో రైతన్నలు భూమిని దున్ని విత్తుకు సిద్ధం చేసుకున్నారు. కొందరు ఇప్పటికే మొక్కజొన్న, మినుము సాగు చేపట్టారు. ఈ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగు చేసేందుకు వీలు ఉంటుందని, అయితే ఇంత వరకు ప్రభుత్వం నుం ఎలాంటి పంటపెట్టుబడి సాయం అందకపోవడం, సబ్సిడీ విత్తనాల పంపిణీ మొదలు కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం హయాంలో సీజన్‌కు ముందే రైతు భరోసా కింద రూ. 13,500సాయంతో పాటు విత్తనాలు, ఎరువులు లభించేవి. దీంతో రైతులు ఎలాంటి ఇబ్బంది లేకుండ పంటసాగు చేపట్టే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఏటా కుందూనది తీరం వెంట ఉన్న 14 గ్రామాల్లో 1100 హెక్టార్లలో వరి సాగయ్యేది. ఈ ఏడాది వరికి ప్రత్యామ్నాయంగా కొంత మంది రైతులు ఇతర పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. హరివరం, మాయలూరు, అల్లూరు, ఇంజేడు, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ, తదితర గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వరి పంట సాగుతో పోలిస్తే ఖర్చు తక్కువ, పెట్టుబడి ఆదా అవుతుందని, రెండు లేదా మూడు నీటి తడులతో మొక్కజొన్న దిగుబడులు చేతికి వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మండల పరిధిలో మొక్కజొన్న 20 హెక్టార్లలో, మినుము 20 హెక్టార్లలో, పెసర 3 హెక్టార్లలో సాగైనట్లు వ్యవసాయాధికారులు వెల్లడించారు.